www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 11 జులై 2025
5
తూర్పుగోదావరి

నవోదయకు సరస్వతి విద్యార్థి రుషిక ఎంపిక

ప్రజాశక్తి - కోరుకొండ

స్థానిక సరస్వతి విద్యానికేతన్‌లో 9వ తరగతి విద్యార్థిని నవోదయకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాం డెంట్ పెనకటి గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వి.రుషిక బ్రహ్మ శ్రీవల్లి నవోదయకు ఎంపిక యిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి రుషికను సాలు వాతో సత్కరించి పుష్పగుచ్ఛం, మోమొంటో అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని రుషికను ఉపాధ్యాయులు కె.ప్రభావతి, వసంతరాయుడు, భవాని, భరతుడు తదితరులు అభినందించారు.

రుషికను సత్కరిస్తున్న గంగాధర్

పెరగనున్న గోదావరి వరద

- లక్ష్మీ బ్యారేజీ నుంచి 6 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల
- భద్రాచలంలో 40 అడుగులకు చేరనున్న నీటి మట్టం
- అప్రమత్తమైన జలవనరుల శాఖ
- ఫ్లడ్ స్టోరేజీల్లో వరద నియంత్రణ సామాగ్రి సిద్ధం

ప్రజాశక్తి - కొవ్వూరు

గోదావరిలో వరద ఉధృతి వారం రోజుల నుంచి నిలకడగా కొనసాగుతుంది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతంలోని లక్ష్మీ బ్యారేజీకి వరద నీరు పోటెత్తింది. దీంతో లక్ష్మీ బ్యారేజీ నుంచి 6 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడిచి పెడుతున్నారు. సీలేరు, శబరితోపాటు ఉప నదుల నుంచి వస్తున్న ప్రవాహం మరో రెండు లక్షల క్యూసెక్కులు ఉంటుందని గోదావరి హెడ్ వర్క్స్ ఇఇ జి.శ్రీనివాస్ తెలిపారు. మరో 24 గంటల వ్యవధిలో ధవలేశ్వరం ఆనకట్ట వద్దకు 8 లక్షల నుంచి గరిష్టంగా 10 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం గోదావరి నుంచి సరాసరి 2.40 లక్షల క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో వరద నీరు వస్తుంది. రానున్న రెండు రోజులు వరద క్రమంగా పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరి వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం అయింది.

గత ఏడాది జూలైలోనే మొదటి ప్రమాద హెచ్చరిక

గోదావరిలో గత ఏడాది జూలై 22వ తేదీన ధవలేశ్వరం ఆనకట్ట వద్ద వరద పది లక్షల క్యూసెక్కులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. అప్పట్లో జులై 22 నుంచి ఆగస్టు రెండో తేదీ వరకు వరద ఉధృతి కొనసాగింది. 29వ తేదీన గరిష్టంగా 16,14,200 క్యూసెక్కుల వరద నీరు చేరింది. ఆ రోజు ధవళేశ్వరం ఆనకట్ట వద్ద నీటిమట్టం గరిష్టంగా 15.8 అడుగులకు చేరింది. ఈసారి పది రోజులు ముందుగానే వరద పరవళ్ళు తొక్కుతుంది. ఈ రానున్న రెండు రోజుల్లో క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు కురిస్తే మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి వెళ్లే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

సముద్రంలోకి 2.65 లక్షల క్యూసెక్కులు విడుదల

ధవలేశ్వరం ఆనకట్ట నుంచి గురువారం సాయంత్రం 6 గంటలకు 2,65,105 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీకి ఉన్న నాలుగు అర్మ్‌లలో ఉన్న 175 గేట్లను 1.4 మీటర్ల నుంచి 1.6 మీటర్ల వరకు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద సాయంత్రం 6 గంటలకు 25.1 అడుగులకు నీటిమట్టం చేరుకున్నట్లు జల వనరుల శాఖ అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు వస్తుండడంతో భద్రాచలం వద్ద నీటిమట్టం 45 అడుగులకు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామన్నారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలోని మూడు డెల్టాలకు 13,750 క్యూసెక్కుల వరద నీటిని దిగుకు విడిచిపెడుతున్నారు. తూర్పు డెల్టాకు 4,800, సెంట్రల్ డెల్టాకు 2,450, పశ్చిమ డెల్టాకు 6500 క్యూసెక్కులు చొప్పున సాగునీరు విడుదల చేస్తున్నారు.

ఫ్లడ్ స్టోరేజీల్లో 44వేల ఇసుక బస్తాలు సిద్ధం

గోదావరిలో గత వారం రోజులుగా క్రమంగా వరద నీరు పెరుగుతున్న దృష్ట్యా జల వనరుల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఫ్లడ్ స్టోరేజీల్లో వరద నియంత్రణకు అవసరమైన సామాగ్రిని సిద్ధం చేశారు. అఖండ గోదావరి నది తీరంలో ఉన్న ఏటిగట్టు పరిరక్షణ దృష్టిలో ఉంచుకుని పోలవరం, ప్రక్కిలంక, తాళ్లపూడి ఫ్లడ్ స్టోరేజీల్లో 44 వేల ఇసుక బస్తాలను సిద్ధం చేస్తున్నట్లు ఎజిఆర్‌బిఎజి మణికంఠరాజు తెలిపారు. 770 క్యూబిక్ మీటర్ల ఇసుకను, 200 సర్వేబాదులు, 2 వేల వెదురు కర్రలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. వీటిలో కొవ్వూరు ఫ్లడ్ స్టోరేజ్ లో 40 వేల ఇసుక సంచులు, 1000 బాదులు 300 క్యూబిక్ మీటర్ల ఇసుక, 800 సర్వే బాదులు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ప్రక్కిలంక ఫ్లడ్ స్టోరేజ్‌లో 2000 ఇసుక సంచులను 300 క్యూబిక్ మీటర్ల ఇసుకను సిద్ధం చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి వరద నియంత్రణ సామాగ్రియంత సిద్ధంగా ఉంటుందని ఆయన వెల్లడించారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

సంక్షేమ పథకాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, ఇతర జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకే అంశానికి చెందిన ఫిర్యాదులు పదే పదే వస్తున్నాయని, అటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో వాస్తవంగా ఫిర్యాదు చేసిన వారిని కలిసి సమస్య తెలుసుకో గలిగితే వాటికి పరిష్కారం లభిస్తుందన్నారు. పి 4 సర్వే ప్రక్రియ ప్రకారం జూలై 17 నుంచి ఆగస్టు 10 వ తేదీ వరకు సేకరించిన డేటా ఆధారంగా మార్గదర్శులతో లబ్ధిదార బంగారు కుటుంబాలతో మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ప్రత్యేక నైపుణ్యత పెంపు విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంక్షేమ వసతి గృహాలను తహశీల్దార్లు తనిఖీలు నిర్వహించి నివేదికను అందజేయాలన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో విత్తనాల పంపిణీ కోసం ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్షేత్ర స్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిపిఒ ఎల్.అప్పలకొండ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులపై నిరంతర పర్యవేక్షణ

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పెట్రోల్ బంకులలో అక్రమాలకు అరికట్టేందుకు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4వ తేదీన 'బంకులపై పర్యవేక్షణ కరువు' శీర్షికతో ప్రజాశక్తిలో వచ్చిన కథనంపై జెసి స్పందించారు. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలోని పెట్రోల్ బంకులపై సంయుక్త తనిఖీలు నిర్వహించేందుకు తహశీల్దార్, డిప్యూటి తహశీల్దార్, లీగల్ మెట్రాలజీ అధికారి, ఆయిల్ కంపెనీలకు చెందిన సేల్స్ అధికారులతో కలిపి మండల స్థాయిలో బృందాలను నియమించామని వెల్లడించారు. ఈ బృందాలు ఆయా మండలాల్లోని పెట్రోల్ బంకులపై సంయుక్త తనిఖీలు నిర్వహించాలని, ఈ తనిఖీల సమయంలో నిబంధనలను పాటిస్తున్నారా? లేదా? అనే పరిశీలించాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. అలాగే బంకుల్లో వినియోగదారులకు కల్పించాల్సిన సౌకర్యాలపైనా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించినట్లు తెలిపారు. సంబంధిత తనిఖీలకు సంబంధించిన నివేదికలను తమకు నివేదించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఆయా బృందాలు ఇచ్చే నివేదకలను ఆధారంగా చేసుకుని నిబంధనలను పాటించిన పెట్రోల్ బంకుల యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సేంద్రియ సాగుతో అధిక ఆదాయం

ప్రజాశక్తి - చాగల్లు

సేంద్రియ వ్యవసాయ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చునని వ్యవసాయ శాఖ ఎడి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని బ్రాహ్మణగూడెం, కలవలపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఎఒ వేణుగోపాలకృష్ణ అధ్యక్షతన పొలంబడి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పర్యావరణాన్ని పరిరక్షణ, మిత్ర పురుగుల సంరక్షణ, పురుగుమందుల వాడకం తగ్గించడం, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించడం, రైతు తన సొంత పొలంలో శాస్త్రవేత్తగా తయారు చేయడం వంటి అంశాలను వివరించారు. రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మారాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గారపాటి విజయదుర్గ, నాయకులు గారపాటి శ్రీనివాస్, గన్నమని రామకృష్ణ, పిచికుల రామకృష్ణ, కొండేపాటి దుర్గాప్రసాద్, కంటిపూడి చిన్ని, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఔదార్యం అభినందనీయం

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాము చదువుకున్న పాఠశాలల్లోని ప్రస్తుత విద్యార్థుల అవసరాలను గుర్తించి వాటిని తీర్చడానికి పూర్వపు విద్యార్థులు చూపిస్తున్న ఔదార్యం అభినందనీయమని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు గోదావరి తాగునీటి కోసం అవసరమైన మంచినీటి సరఫరా కోసం రూ.2.50 లక్షలతో నిర్మించిన ట్యాంకును ఎంఎల్‌ఎ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మలకపల్లి సహకార బ్యాంకు అధ్యక్షులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఆర్‌డిఒ రాణి సుస్మిత, తహశీల్దార్ లక్ష్మీ లావణ్య, ఎంపిడిఒ ఎస్.వేణుగోపాల్ రెడ్డి, ఎంఇఒ బాలామణి, కూటమి నాయకులు ఐ.రామకృష్ణ, కె.శ్రీనివాస్, డి.సత్తిబాబు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న ఎంపి పురంధేశ్వరి

బౌద్ధ ధమ్మ పీఠంలో మొక్కలు నాటిన ఎంపి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

స్థానిక బౌద్ధ ధమ్మ పీఠంలో పీఠాధిపతి భంతే అనాలయో ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవంలో ఎంపి దగ్గుపాటి పురంధేశ్వరి గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పీఠాధిపతి అనాలయో బుద్ధుని బోధనలను వివరించారు. పంచ వర్గీయ భిక్షువులకు బుద్ధుడు మొదటి ప్రవచనం చేసిన రోజుకు గుర్తుగా బుద్ధ పూర్ణిమ నిర్వహిస్తారని అన్నారు. వన మహోత్సవం పురస్క రించుకుని పలు రకాల మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గన్నమని వెంకట సుబ్రహ్మణ్యం, కుదప చక్రపాణి, కళారావు, కెవి.సుబ్బారావు, పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో జాతీయ చేప రైతుల దినోత్సవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో జాతీయ చేప రైతుల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. జంతు శాస్త్ర విభాగం జ్యూలాజీ క్లబ్ కార్యకలాపాలలో భాగంగా నిర్వహించిన ఈ వేడుకలో పోస్టర్ ప్రదర్శనలు,క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్.కె చేప రైతుల నుంచి నేర్చుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శైలజ మాట్లాడారు.

తరగతి గదుల్లోనే ఉజ్వల భవిష్యత్

పిటిఎం క్రార్యక్రమంలో మంత్రి కందుల

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల్లో పేరెంట్స్, టీచర్స్‌తో ఆత్మీయ సమావేశాలు జరిగాయి. నిడదవోలు నియోజకవర్గంలోని పలు చోట్ల పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల్లో జరిగిన పిటిఎం కార్యక్రమాల్లో పలువురు ఎంఎల్‌ఎలు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం : టౌన్ మున్సిపల్ హైస్కూల్ పిటిఎంలో ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి వాసు పాల్గొన్నారు. 9వ తరగతి విద్యార్థి జాహ్నవి ఎంఎల్‌ఎ వాసు చిత్రపటాన్ని గీసి ఆయనకు అందజేసింది. ఈ కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్, 38వ వార్డు ఇన్‌ఛార్జ్ బుడ్డిగ రవి, గోపాలకృష్ణ, పాఠశాల హెచ్‌ఎం ఎ.సూరిబాబు పాల్గొన్నారు. కంటిపూడి రామారావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ లోకేష్, కంటిపూడి రమాదేవి, ఎన్.సుబ్బలక్ష్మి, మాజీ కార్పొరేటర్ విజయభారతి, హెచ్‌ఎం వైవి.రామారావు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు. అలాగే చున్నీలాల్ జాజు ఉన్నత పాఠశాలలో జరిగిన పిటిఎం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. **చాగల్లు :** స్థానిక జడ్‌పి హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి చింతల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు కెవివి.రామాంజ నేయులు, సిహెచ్.శుభాకర్, హెచ్‌ఎం ఎస్.వాసవి పాల్గొన్నారు. **ఉండ్రాజవరం :** తరగతిగదుల్లోనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు నిర్మాణం జరుగుతుందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఎంవిఎన్ జడ్‌పి హెచ్‌స్కూల్‌లో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ఒక్క చదువు మాత్రమే కాకుండా అన్ని రంగాల్లోనూ రాణించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. విద్యార్థులను పాఠశాలలో చేర్చినంత మాత్రాన తల్లిదండ్రుల బాధ్యత పూర్తయినట్లు కాదన్నారు. పాఠశాల నుంచి పిల్లలు ఇంటికి వచ్చిన అనంతరం తప్పనిసరిగా వారిని పట్టించుకోవాలన్నారు. యువతను కాపాడాలంటే తల్లిదండ్రుల గత ప్రభుత్వంలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల తల్లికి మాత్రమే అమ్మ వడి పథకం వర్తించేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం ఇంటిలోని ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం ఇస్తున్నామన్నారు. విద్యకు సంబంధించిన వివిధ పథకాల పేర్లకు ఫ్యాక్షన్ లీడర్ల పేర్లు పెట్టకుండా, మధ్యాహ్న భోజనానికి డొక్కా సీతమ్మ, విద్యార్థులకు అందజేసే విద్యా కిట్లకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మహనీయుల పేర్లు పెడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు, ఎస్‌ఎంసి ఛైర్మన్లు, సభ్యులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు. **రాజమహేంద్రవరం రూరల్** ధవళేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పిటిఎం కార్యక్రమంలో పోలీసు అధికారి భవ్యకిషోర్, టిడిపి నాయకులు గోరంట్ల రవికిరణ్, ఇతర పెద్దలు పాల్గొన్నారు. ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ ఎ.వెంకటరమణ గత ఏడాది ప్రగతి నివేదికను వివరించారు. **గోపాలపురం :** మండలంలోని కొవ్వూరుపాడు, రాజంపాలెం జడ్‌పి హైస్కూల్లో నిర్వహించిన పిటిఎం సమావేశాల్లో కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిన్నవయసులోనే మంచి అలవాట్లను అలవర్చుకునేలా తగు శిక్షణ తల్లిదండ్రులే ఇవ్వాలని అన్నారు. రాజంపాలెంలో వంట షెడ్డును కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎ పీడీ ఎస్.సుభాషిణి, హెచ్‌ఎంలు శ్రీపాధ బ్రహ్మాజీ, మడిచర్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **నిడదవోలు:** స్థానిక జూనియర్ కాలేజీలో, జడ్‌పి బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పిటిఎంలో మంత్రి దుర్గేష్ పాల్గొని మాట్లాడారు. సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భూపతినారాయణ, డిఇఒ వాసుదేవారావు, ప్రత్యేక అధికారి దుర్గేష్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ వజీరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు. **దేవరపల్లి:** దుద్దుకూరు జడ్‌పి హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు పాల్గొన్నారు. అలా గే మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో పిటిఎం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. **గోకవరం:** కామరాజుపేట జడ్‌పి ఉన్నత పాఠశాలలో జరిగిన పిటిఎం కార్యక్రమంలో ఎస్‌పి నరసింహకిషోర్ పాల్గొని మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. డిఎస్‌పి శ్రీకాంత్, సిఐ సత్యకిషోర్, ఎస్ఐ పవన్‌కుమార్, జగ్గంపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ అడపా భరత్‌కుమార్ పాల్గొన్నారు. కృష్ణునిపాలెం ఎంపిపి యుపి స్కూల్‌లో టిడిపి మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కిషోర్, ఎస్‌ఎంసి ఛైర్మన్ అమరా వెంకటరామయ్యదొర, హెచ్‌ఎం బి.అబ్బులు, ఎలిమెంటరీ స్కూల్ హెచ్‌ఎం ప్రేమ కుమార్, వైస్ ఛైర్మన్ ఎం.సీత, పాల్గొన్నారు. **సీతానగరం** మండలం రఘుదేవపురం జడ్‌పి హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ, జెసి చిన్నరాముడు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 'నా సేన కోసం నా వంతు' రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, ఎంఇఒ స్వామినాయక్, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మట్ట వెంకటేశ్వ రరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. **తాళ్లపూడి:** వేగేశ్వరపురం జూనియర్ కళాశాలలో జరిగిన పిటిఎలో ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. కాలేజీ ప్రాంగణం, ఇతర పనులకు నిధులు సమకూరుస్తానని హామీ ఇచ్చారు. జె.సుబ్బరాయచౌదరి, ఎస్.చిన్ని, కె.శ్రీనివాస్, ఐ.రామకృష్ణ, ఎంపిడిఒ వేణుగోపాల్‌రెడ్డి, తహశీల్దార్ లక్ష్మీలావణ్య పాల్గొన్నారు. మాంటిస్సోరీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ పిటిఎంలో హైస్కూల్ వ్యవ స్థాపక కరస్పాండెంట్ వివి.అనీష్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. **కోరుకొండ** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పిటిఎం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ పాల్గొని మాటా ్లడారు. విద్యాపరంగా విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వామ్యం చేసే లక్ష్యంతోనే ప్రభుత్వకీ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి.కృష్ణకిషోర్, డిఎఫ్ఒ శ్రీనివాస్, సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, కళాశాల విద్యార్థులు, పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి దుర్గేష్

గోపాలపురంలో విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్

రాజమహేంద్రవరంలో ఎంఎల్‌ఎ వాసుకు ఫొటో ఇస్తున్న విద్యార్థిని

తాళ్లపూడిలో తల్లులకు పాద పూజ చేస్తున్న విద్యార్థులు

కార్టూ'నిజం'



అర్హులందరికీ ఓటు హక్కు తప్పనిసరి

ప్రజాశక్తి - గోపాలపురం

18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి పి.భాగ్యవతి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం తహశీల్దార్ అజయ్‌బాబు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని 50 మందికి ప్రత్యేక సమ్మరీ రివిజన్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ బిఎల్ఒ ఓటరు ఇంటికి వెళ్లినప్పుడు మర్యాదగా నడుచుకోవాలని, పూర్తిస్థాయిలో వివరాలు సేకరించాలని అన్నారు. ఓటు హక్కు కలిగి ఉండి చనిపోయినట్లయితే వారి ఓట్లు తొలగించాలని తెలిపారు. శిక్షకుడు సాదిక్, ఎఎస్ఒ జోడాల వెంకట్ బూత్ లెవెల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఆన్ లైన్ పరీక్ష రాయించి వారికి డిటి సాంబమూర్తి చేతుల మీదుగా సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సహాయకులు నల్లరాజు, విఆర్ఒలు, విఆర్ఎలు, బిఎల్ఒలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి భాగ్యవతి

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ థామస్

ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కాటవరం గ్రామంలో దహించు అగ్ని మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బిషప్ డాక్టర్ థామస్ పుట్టినరోజు సందర్భంగా మెగా వైద్య, రక్తదాన శిబిరాలను గురువారం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో రాజమహేంద్రవరంకు చెందిన పలువురు వైద్యనిపుణులు వైద్య సేవలందించారు. రక్తదాన శిబిరంలో యువకులు స్వచ్ఛంధంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బిషప్ థామస్ మాట్లాడుతూ మెగా మెడికల్ క్యాంపులో వైద్య సేవలందుకున్న వారిలో అవసరమైన వారికి రూ.3 లక్షల విలువైన మందులను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ షీబా థామస్, క్యాథరిన్ జాయిస్, కరిష్మా ప్రైస్, తదితరులు పాల్గొన్నారు.

నరసయ్యకు మంత్రి అభినందన

ప్రజాశక్తి - కడియం

మండలంలోని కడియపులంక సహకార సంఘ త్రీ మేన్ కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికైన గట్టి నరసయ్యను మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు. గురువారం మంత్రిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల నర్సరీ రైతులకు మరిన్ని సేవలు అందించి, సంఘ అభివృద్ధికి కృషి చేయాలని నరసయ్యకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పుల్లా రామారావు, జనసేన పార్టీ నాయకులు పాఠంశెట్టి రవి పాల్గొన్నారు.


మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నరసయ్య

కామరాజుపేటలో సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని కామరాజుపేట గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ జ్యోతుల

నేరాలు ఘోరాలు

మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

మద్యం తరలిస్తున్న ఇద్దరిని గురువారం అరెస్ట్ చేశామని ద్రాక్షారామం ఎస్ఐ ఎం.లక్ష్మణ్ తెలిపారు. వివరాలు ఇవి.. ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తరలిస్తున్న రొంగల చంద్రమౌళిని అన్నాయిపేట వద్ద పట్టుకొని రూ.2,736 విలువైన 12 సీసాలు పోలీసులు స్వాధీనం చేసు కున్నారు. అదేవిధంగా కర్రి సుమంత్రెడ్డిని యానాం కూడలి లో పట్టుకొని రూ.2,700 విలువైన 12 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చాగల్లు

పంగిడిలో మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడిన చాగల్లుకు చెందిన శ్రీరంగం కృష్ణారావు (59) పరిస్థితి విషమించడంతో ఆసుపత్రిలో బుధవారం మృతి చెందాడు. సైకిల్‌పై ఇందిరమ్మ కాలనీ నుంచి చాగల్లుకు వస్తుండగా పంగిడి సమీపంలో వెనుకనుంచి బైకు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో కృష్ణారావు రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్ర గాయమైంది. వెంటనే అతన్ని అంబులెన్స్‌లో రాజమహేంద్రవరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు మృతుని కుమారుడు శ్రీరంగం లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎఎస్ఐ వి.శ్రీనివాసరావు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ముఠా అరెస్టు

ప్రజాశక్తి - దేవరపల్లి

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసులో నిందితులను అరెస్టు చేశామని డిఎస్‌పి దేవకుమార్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. కొంతకాలంగా మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకు పోతున్నారని తెలిపారు. వీటిపై వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు చేసినట్లు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నేపథ్యంలోనే బుధవారం సాయంత్రం దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద అనుమానస్పదంగా తిరుగుతున్న నలుగురుతో ఉన్న ఒక ముఠాను ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం, ఇతర సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారించారన్నారు. ఈ ముఠా సభ్యులపై వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులున్నాయన్నారు. పలు నేరాల్లో అరెస్టు అయి ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నట్లుగా గుర్తించామన్నారు. ఇప్పటి వరకూ ఈ ముఠా ఏలూరు, పశ్చిమగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో 115 ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించిందని తెలిపారు. పగలు ద్విచక్రవాహనాల్లో రెక్కీ నిర్వహించి, రాత్రి సమయాల్లో సెల్ఫ్ డ్రైవింగ్ కోసం కారు అద్దెకు తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి అందులో రాగి వైర్లను దొంగతనం చేస్తున్నారని తెలిపారు. వారి నుంచి రూ.10 లక్షల విలువ చేసే 65 కేజీల రాగి దిమ్మలను, 116 కేజీల వైర్లు, వీటి రవాణా ఉపయోగించిన రెండు కార్లు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిఐ నాగేశ్వరనాయక్, క్రైం సిఐ శ్రీధర్‌కుమార్, ఎపిఇపిడిసిఎల్ ఎఇ నారాయణఅప్పారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణ పరిధిలోని చెందుర్తి జాతీయ రహదారి జంక్షన్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బుధవారం రాత్రి కలకత్తా నుంచి చెన్నయ్ వెళ్తున్న బియ్యం లోడు లారీ డ్రైవర్ రోడ్డుపక్క లారీని ఆపాడు. లారీ కింద మరమ్మతులు చేసికుని బయటకు వస్తుండగా విశాఖ నుంచి రాజమండ్రి వెళ్తున్న బొగ్గు లోడు లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తైమూర్ రెహ్మాన్ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని వెంటనే ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

యువకుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినకొండేపూడికి చెందిన యువకుడు అనుమానాస్పద రీతిలో మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, కాన్పూర్ జిల్లా తేసిల్ సికింద్రా, జలాల్‌పూర్‌కి చెందిన అంకిత కటియావ్(34) సీతానగరం నుంచి గోకవరం మధ్య ఎయిర్ టెల్ ఫైబర్ కేబుల్ లైన్లు వేయడానికి ఉపాధి నిమిత్తం వచ్చారు. చినకొండేపూడిలో ఒక మెడికల్ దుకాణంపై రూం అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. గురువారం సహుద్యోగి ఫోన్ చేయగా, ఫోన్ తీయకపోవడంతో రూంకి వెళ్ళగా అక్కడ అంకిత్ కటియావ్ అనుమానాస్పద రీతిలో మృతి చెంది ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

మిస్సింగ్ కేసు నమోదు

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన కొయ్యే పోతురాజు(32) కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోతురాజు సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈనెల 5వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి అతను రాకపోవడంతో చుట్టుపక్కల గ్రామాల్లో అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికారు. ఎక్కడా అతని ఆచూకి తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎఎస్ఐ వై.రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - పెరవలి

పెరవలి శివారున నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. దీంతో జూదరులు పోలీసులను చూసి పొలాల్లోకి పారిపోయారు. అయితే వీరిని డ్రోన్ సాయంతో కనిపెట్టి పొలాల్లో దాక్కున్న జూదరులను ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు అరెస్టు చేశారు. ఈ దాడిలో 10 మంది జూదరులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.5,520 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సొసైటీ పదవుల కేటాయింపులో అన్యాయం

- రాస్తారోకోకు దిగిన జనసేన ఇన్‌ఛార్జ్ టివి.రామారావు
- మూడింటికి ఒక్కటే ఇచ్చారని ఆవేదన
- బాధ్యతల నుంచి తప్పించిన అధిష్టానం

ప్రజాశక్తి - కొవ్వూరు

నియోజకవర్గంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీల ఎంపికలో జనసేనకు అన్యాయం చేశారని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ టివి.రామారావు ఆరోపించారు. గురువారం రోడ్ కమ్ రైల్ వంతెన జంక్షన్ వద్ద రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌ని సంప్రదించకుండా పదవులు కేటాయించారని ఆరోపించారు. తాము మూడు సొసైటీలు కేటాయించాలని ప్రతిపాదించామని, కేవలం ఒక్క సొసైటీ మాత్రమే ఇవ్వడం అన్యాయమన్నారు. పొత్తు ధర్మం పాటించకుండా జనసేన పార్టీని నియోజక వర్గంలో లేకుండా చేద్దామన్న కుట్రలో భాగంగా ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో ఏం న్యాయం చేస్తారని మండిపడ్డారు. జనసేన పార్టీపై సవతి తల్లి ప్రేమ చూపించొద్దని, న్యాయ బద్ధంగా రావలసిన వాటా ప్రకారం పదవులు కేటా యించాలని ఆయన డిమాండ్ చేశారు. ట్రాఫిక్ నిలిపివేయడంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు. జనసేన శ్రేణులు ధర్నా చేస్తున్న సమయంలో ఎంపి దగ్గుపాటి పురందరేశ్వరి అదే మార్గంలో వెళ్లినా ఆమె ఆయనతో ఏమీ మాట్లాడకుండానే వెళ్లిపోయారు.

ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి తొలగింపు

సొసైటీ త్రీ సభ్య కమిటీల్లో జనసేన పార్టీకి అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ రాస్తారోకోకు దిగిన జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ టివి.రామారావును ఆ పార్టీ అధిష్టానం ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జనసేన పార్టీ హెడ్ కాన్ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ హెడ్ వేములపాటి అజయ్‌కుమార్ ఈ మేరకు గురువారం ఒక ప్రకటనను విడుదల చేశారు. 'పార్టీ విధానాలకు భిన్నంగా మీరు వ్యాఖ్యలు చేయడం, కార్యక్రమాలు నిర్వహించడం పార్టీ దృష్టికి వచ్చాయి. కూటమి స్ఫూర్తిని విఘాతం కలిగించేలా మీ చర్యలు ఉన్నందున మిమ్మల్ని పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి తక్షణం తప్పించడమైనది. తుది నిర్ణయం తీసుకునే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలి' అని ఆ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇప్పటికే నియోజకవర్గంలో తాళ్లపూడి, చాగల్లు, కొవ్వూరు మండలాలకు చెందిన పార్టీ మండల అధ్యక్షులకు రామారావుకు మధ్య సఖ్యత లేదు. జనసేనలో క్రియాశీలకంగా పనిచేస్తున్న పలువురు నాయకులు సైతం ఈయనకు దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఇన్‌ఛార్జ్ బాధ్యతలు తప్పిస్తూ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేయడం సర్వత్ర చర్చనీయాంశమైంది.

ఎంసి చైర్మన్‌గా శ్రీరామ్‌చౌదరి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చాగల్లుకు చెందిన నాదెండ్ల శ్రీరామ్‌చౌదరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని ఎంసి కార్యాలయంలో జరిగిన బాధ్యతల స్వీకార కార్యక్రమం అనంతరం ఆయనను కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. ఆయనతోపాటు, వైస్ ఛైర్మన్‌గా తాళ్లపూడి మండలానికి చెందిన రేకపల్లి మంగామణి, డైరెక్టర్లుగా మాజీ కౌన్సిలర్ అర్జెల్లి చిట్టెమ్మ, పసివేదల మాజీ సర్పంచ్ బేతన కాశీఅన్నపూర్ణ, గంగుమళ్ల స్వామి, దేవరకొండ మహాలక్ష్మి, జొన్నా బాలకృష్ణ, కరుటూరి మౌనిక, కవల రామాంజనేయులు, కొప్పాక విజయ్‌కుమార్, మద్దుకూరి ఎఎస్‌ఆర్‌సివివిఎస్ సోమసుందర్రావు, నందిన వెంకట్రావు, పిఎస్.దుర్గావరలక్ష్మి, రేగడమిల్లి నాగదుర్గ, మట్టే వీరవెంకటవరప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంసి ఛైర్మన్ ఆళ్ల హరిచంద్రప్రసాద్, అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, సూర్యదేవర రంజిత్, మద్దిపట్ల సురేష్, నాయుడు వీర్రాజు, చాగల్లు మాజీ ఎంపిపి కేతాసాహెబ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎసిబికి చిక్కిన రాజోలు ఆర్ఐ

ప్రజాశక్తి- రాజోలు

రాజోలు తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న కె.రాంబాబును ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రాజోలు గ్రామానికి చెందిన గుబ్బల కృష్ణతులసి భర్త అగ్నిమాక కేంద్రంలో ఫైర్ ఆఫీసర్‌గా పని చేస్తూ గుండెపోటుతో మృతి చెందారు. ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్ కోసం ఆమె నో ప్రాపర్టీ, నో ఎర్నింగ్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంది. ఈ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఆర్ఐ రాంబాబు నెలరోజులుగా ఆమెను తిప్పుతున్నాడు. సర్టిఫికెట్లు ఇవ్వడానికి రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో ఆమె ఎసిబి అధికారులను ఆశ్రయించింది. గురువారం బాధితురాలు నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఎసిబి డిఎస్‌పి కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో సిఐలు భాస్కరరావు, సతీష్, వాసుకృష్ణ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కొన్నిరోజుల క్రితమే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ.15 వేలు లంచం తీసుకున్నాడని, మళ్లీ నో ప్రాపర్టీ, నో ఎర్నింగ్ సర్టిఫికెట్‌లకు రూ.20 వేలు డిమాండ్ చేయడంతో విసిగి ఎసిబిని ఆశ్రయించానని బాధితురాలు కృష్ణ తులసి తెలిపింది. ఆర్ఐ రాంబాబు నాలుగు నెలల క్రితమే రామచంద్రపురం నుంచి రాజోలుకు బదిలీపై వచ్చారు. విధుల్లో చేరిన నాటి నుంచే తమకు ఫిర్యాదులు వచ్చాయని ఎసిబి డిఎస్‌పి తెలిపారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

వైసిపి నేతల అసత్య ఆరోపణలు తగవు

ప్రజాశక్తి - పెద్దాపురం

వైసిపి నాయకులపై కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతోందని వైసిపి నాయకులు ఆరోపించడం తగదని టిడిపి నాయకులు అన్నారు. గురువారం స్థానిక సుధా కాలనీలోని టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు తోట రామకృష్ణ, ఎలిసెట్టి నాని, నూనె రామారావు మాట్లాడారు. వైసిపి కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నామని వైసిపి నేత దొరబాబు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై మాత్రమే పోలీసులు కేసులు పెట్టారన్నారు.

సత్యనారాయణ స్వామికి ఘన నివాళి

ప్రజాశక్తి-గండేపల్లి

స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద గురువారం ఆలయకర్త తర్లాడి సత్యనారాయణ స్వామి ఐదవ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు సత్తిబాబు దంపతులను ఘనంగా సన్మానించారు.

అన్నదానం కోసం విరాళాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో అన్నదానం నిర్వహణకు గురువారం పెద్దాపురం వాస్తవ్యులు మలిరెడ్డి కష్ణారావు, గంగ వారి కుటుంబ సభ్యులు రూ.10 వేలు, ప్రత్తిపాటి రామలింగం వారి కుటుంబ సభ్యులు రూ.10,116 అన్నదాన విరాళాలుగా అందజేశారు. వారికి ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేద పండితులు, ఆసాదులు ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కూటమి ప్రభుత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధి

ప్రజాశక్తి - సామర్లకోట

కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం సామర్లకోట 10వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున ఎంఎల్ఎ చినరాజప్పకు స్వాగతం పలికారు. అక్కడి సమస్యలను మహిళల్ని అడిగి ఎంఎల్ఎ చినరాజప్ప తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, వల్లూరి దొరబాబు, నిమ్మకాయల కిరణ్ కుమార్, కొర్లమండ వీరభద్రరావు, శ్రీవాణి, కాళ్ల రవీంద్రబాబు, మెండం సర్రయ్య పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షునిగా 'పైలా' బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- రౌతులపూడి

రౌతులపూడి సొసైటీ అధ్యక్షునిగా ఎన్నికైన పైలా పైడ్రాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పైడ్రాజు బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి టిడిపి మండల అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పైల సాంబశివరావు సర్పంచ్ పైల సీత, పైల నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా పైలా పైడ్రాజు మాట్లాడుతూ తనకు అధ్యక్షునిగా అవకాశం కల్పించిన ఎంఎల్ఎ వరుపుల సత్య ప్రభకు కతజ్ఞతలు తెలిపారు.

నిలిచిన గ్యాస్ లీకేజీ

ప్రజాశక్తి - అమలాపురం

మామిడికుదురు మండలం పాశర్లపూడి లంక ఒఎన్‌జిసి క్షేత్రంలో జరిగిన గ్యాస్ లీకేజీని ఒఎన్‌జిసి సాంకేతిక బృందం అరికట్టిందని అమలాపురం ఆర్‌డిఒ కె.మాధవి అన్నారు. గురువారం అమలాపురం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం నందు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 9న రాత్రి 7:45 గంటలకు రిగ్ నుండి మడ్ తో కూడిన శబ్దం, గ్యాస్ లీకేజ్ అంశాలపై వివ రించారు. పాశర్లపూడి లంక ఒఎన్‌జిసి క్షేత్రంలో వెల్ పిఎస్‌సివి, రిగ్గు నెంబర్ ఈ 2000-3 లో డ్రిల్లింగ్ చేస్తుండగా అత్యధిక పీడనంతో ఒకేసారి పెద్ద శబ్దంతో బురదతో కూడిన గ్యాస్ ఎగిసిపడిందన్నారు.. ఈ పరిస్థితిని ఒఎన్‌జిసి సాంకేతిక బృందం చాకచక్యంగా బోరుబావి నుంచి లీకేజీని అరికట్టారన్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని గ్రామస్తులు భయాందోళన కు గురికావలసిన అవసరం లేదన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని చాగల్లు, గౌరీపట్నం గ్రామాల్లోని 33 కెవి ఫీడర్లలో మరమ్మతులు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎఇ ఎస్.త్రిమూర్తులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చాగల్లు, నెలటూరు, మీనానగరం, లిఫ్ట్ ఇరిగేషన్, అమ్మిగుంట ఫీడర్, ఉన్నగాట్ల, ఎస్.ముప్పైవరం, నందిగంపాడు, కుంకుడుమిల్లి గ్రామాలతోపాటు, వ్యవసాయ శాఖ ఫీడర్లకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయ విద్యుత్‌ను ఉదయం 4 గంటల నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం 1 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. అలాగే నిడదవోలు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బ్రాహ్మణగూడెం, గరప్పాడు, దారవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ గ్రామాల్లో త్రీ ఫేస్ కనెక్షన్లకు ఉదయం 4 గంటల నుంచి 8 గంటల వరకూ, మిగతా బ్యాలన్స్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సరఫరా చేస్తామన్నారు.

పెరవలిలో...

మండలంలోని మల్లేశ్వరం 33 కెవి ఎస్‌విఆర్ ఫీడర్‌లో ట్రీ కటింగ్ నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎన్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అన్నవరప్పాడు, మల్లేశ్వరం, కడింపాడు, పిట్టలవేమవరం, ఖండవల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు, మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్‌ను సరఫరా చేస్తామన్నారు.

గుట్కాలు అమ్మితే చర్యలు తప్పవు

ప్రజాశక్తి -యు. కొత్తపల్లి

ఉప్పాడ కొత్తపల్లి ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న కిరాణా, కిల్లి దుకాణాలలో సిగరెట్లు, గుట్కాలు అమ్మితే చర్యలు తప్పవని పిఠాపురం సిఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. గురువారం బీచ్ రోడ్‌లో మద్యం సేవించి వాహనాలు నడప రాదని తెలుపుతూ తనిఖీలు చేపట్టారు. పాఠశాల సమీపంలో పొగాకు ప్రొడక్ట్స్, అమ్మిన వారికి చలానాలకు విధించారు. ఆయన వెంట కొత్తపల్లి ఎస్ఐ వెంకటేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు

కాకినాడ సెజ్‌లో శ్రీసిటీ తరహా అభివృద్ధి

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ సెజ్‌ను శ్రీసిటీ తరహాలో అభివృద్ధి చేస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పిఎన్‌వి.మాధవ్ అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి ఎన్నో నిధులను మంజూరు చేసి అభివద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు ఎనలేని సహాయం అందిస్తోందని మాధవ్ చెప్పారు. గురువారం ఆయన నగరంలో ఉన్న పలువురిని కలిసేందుకు వచ్చారు. ఈ సందర్భంగా పైడా బావన ప్రసాద్ స్వగహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో బిక్కిన విశ్వేశ్వరరావు, పైడా కృష్ణమోహన్, వేటుకూరి సూర్యనారాయణరాజు, ఎనిమిరెడ్డి మాలకొండయ్య పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని కాకినాడ సిటీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు మత్స్యకారులకు పిలుపునిచ్చారు. జగన్నాథపురంలోని రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ సమావేశం హాల్లో గురువారం మత్స్య కృషివలుల దినోత్సవాన్ని నిర్వహించారు. సంస్థ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.అంజలి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ ముఖ్యఅతిథిగా, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. తొలుత ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.అంజలి జాతీయ మత్స్య రైతుల దినోత్సవ విశిష్టతను వివరించారు. మత్స్యకారులకు సంబంధించిన వివరాలను క్యూఆర్ కోడ్‌తో అనుసంధానం చేస్తామన్నారు. దీని వల్ల మత్స్యకారుల డేటా తమ వద్ద ఉంటుందన్నారు. అనంతరం సిటీ ఎంఎల్ఎ కొండబాబు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆక్వా రైతులు ఎస్-ఎస్‌విఎన్.చౌదరి, యాళ్ళ రవికుమార్, పబ్బినీడి కృష్ణ, సిహెచ్.వెంకటేశ్వరరావు, పి.వీరగణపతి, కె.రమణలను ఎంఎల్ఎ చేతుల మీదుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు బలసాడి రంగారావు, జిల్లా మత్స్య శాఖ అధికారి వి.కృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

విపత్తులను ఎదుర్కొనేందుకు కార్యాచరణ

ప్రజాశక్తి - అల్లవరం

గోదావరి వరదలు, ప్రకృతి విపత్తుల సమర్థవం తంగా ఎదుర్కొ నేందుకు మండల స్థాయి యంత్రాంగం సమాయత్తం కావాలని ఆర్‌డిఒ కె.మాధవి ఆదేశిం చారు. గురువారం స్థానిక మండల పరిషత్ అభివద్ధి అధికారి వారి కార్యాలయం లో మండల అధికారులతో సమావేశం నిర్వహించి ఆర్‌డిఒ మాట్లాడుతూ గోదావరి వరదలు, తుపాన్లు తుఫాన్లు వంటి ఎదుర్కొనేందుకు పక్కా కార్యాచరణ ప్రణాళి కలతో ఒకటే, రెండు, మూడు ప్రమాద హెచ్చరికలకు అను గుణంగా ముంపు బారిన పడే గ్రామాలలో సహాయక చర్యలకు సన్నద్ధంగా ఉండాలని సూచిం చారు. ఆర్‌డబ్ల్యూఎస్, సిపిడబ్ల్యూ స్కీముల వద్ద తాగునీటి సరఫరాకై విద్యుత్ సరఫరాకు ప్రత్యామ్నా యంగా జనరేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. కమ్యూ నికేషన్ వ్యవస్థ ఉండే విధంగా మెలకువలు పాటిం చాలని పునరావాస కేంద్రాలలో వసతులను కల్పిం చాలని, సహాయక చర్యలకు పడవలు గజ ఈతగాళ్లు లైఫ్ జాకెట్లతో సహా సిద్ధపరుచు కోవాలన్నారు. నిత్యావసరాలు మూడు నెలల పాటు నిల్వ చేసుకోవా లని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించ కుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

IN THE HONOURABLE COURT OF THE XTH ADDITIONAL DISTRICT JUDGE CUM (MACT) AT ANAKAPALLE
M.V.O.P.608/2024
Between :
Mummana Suribabu **...Petitioner**
And
Penke Siva Prasad and others **...Respondents**
NOTICE
To
Respondent-1
Penke Siva Prasad
S/o Polaraju, aged 32 years, R/o H.No.6-69, Bhavanarayana puram village, Sarpavaram Mandalam, Kakinada District.
(The Driver of the Lorry Bearing No. AP 31 TU 2989 and Owner of Said Lorry as Per C-Book)
Please Take notice that the above case posted to for your appearance on **Dt. 22-07-2025 at about 10:30 am** before the Honourable court in person or through your advocate failing which the matter will be decided exparte.
Betina Srinivas
Advocate, Sabbavaram

విద్యుత్ స్మార్ట్ మీటర్లతో ప్రజల జీవన ప్రమాణాలు దివాళా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

విద్యుత్ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజల జీవన ప్రమాణాలు దివాళా తీస్తాయని కాంగ్రెస్ పార్టీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు టికె.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ రాజమహేంద్రవరంలోని గోదావరి గట్టున గల విద్యుత్ శాఖ ఎస్ఇ కార్యాలయం ఎదుట గురువారం ఆయన రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ వినియోగదారులు ముందస్తుగా రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియలో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి ఒక్కో రేటు నిర్ణయించారని, ఇది ప్రజలను దోపిడీ చేయడమేనని ఆయన వ్యాఖ్యానించారు. వెంటనే విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించడం ఆపాలలన్నారు. ఆదాని సంస్థతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాన్ని తక్షణం రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు.. మాజీ ఎంపీ జివి.హర్షకుమార్ దీక్షా శిబిరాన్ని ప్రారంభించి సంఘీభావం తెలిపారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, నాయకులు బి.పవన్, పోలిన వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి టి.మధు, రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు అశోక్‌కుమార్‌జైన్, అఖిలపక్ష నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పిసిసి జనరల్ సెక్రటరీ అరిగెల అరుణ కుమారి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోతా శారద తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

గెలుపొందిన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు

ఉత్సాహంగా ఫుట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి - యానాం

యానాం విద్యాశాఖ నిర్వహిస్తున్న ప్రాంతీయ స్థాయి ఆటల పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. గురువారం ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. బాలయోగి స్టేడియంలో నిర్వహించిన పోటీలలో రీజన్సీ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించగా రాజీవ్ గాంధీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ద్వితీయ స్థానం సాధించాయి. తృతీయ స్థానంలో డాక్టర్ కెఆర్.నారాయణన్ గవర్నమెంట్ హైస్కూల్ నిలిచిందని జోనల్ గేమ్స్ కార్యదర్శి కొప్పనాతి భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ అడలరసన్ క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. అనంతరం గెలుపొందిన జట్లకు సీనియర్ పిఇటి పి.సత్యనారాయణ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, మోహన్, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న మిషన్ శక్తి టీమ్

కనకాలపేటలో డయేరియాపై అవగాహన

ప్రజాశక్తి - యానాం

మహిళ, శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్థానిక కనకాలపేటలో డయేరియాపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. అక్కడి తల్లులకు, సంరక్షకులకు పిల్లల్లో వచ్చే డయేరియా నివారణ, పరిశుభ్రత పాటించడం, ఒఆర్ఎస్, జింక్ మాత్రల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మిషన్ శక్తి కోఆర్డినేటర్ రిబ్కా రోస్లిన్, ఎఎన్ఎం కృష్ణవేణి, మిషన్ శక్తి సభ్యులు, ఆశాలు పాల్గొన్నారు.

CHANGE OF MY NAME
My Old Name is KUCHERLAPATI DEVI. My changed name is KUCHERLAPATI NAGAMANI, W/o. Kucherlapati Hemanth Kumar Varma. Since today onwards, my changed and new name is **KUCHERLAPATI NAGAMANI,** W/o. Kucherlapati Hemanth Kumar Varma.
KUCHERLAPATI NAGAMANI
D.No. 3-141, Venkatagiri Konda
Bommuru, Rajamahendravaram Rural
Cell: 79815 64799

దస్తావేజులు పడిపోయినవి
పెద్దాపురం మండలం, చినబ్రహ్మదేవం గ్రామానికి చెందిన ఆచంట సూర్యకుమారి, W/o. సూర్యనారాయణ తెలియజేయునది ఏమనగా,
నాకు చినబ్రహ్మదేవం గ్రామంలో సర్వే నెంబరు 259/1, 260/1 లో ఎ. 1.20 సెంట్లు భూమి కలదు. ఈ భూమికి సంబంధించిన 297/1995 నెంబరు గల దస్తావేజులు తీసుకుని జిరాక్స్ నిమిత్తం పెద్దాపురం మెయిన్‌రోడ్‌లో వెడుతుండగా పడిపోయినవి. దొరికినవారు ఈ క్రింది అడ్రసుకు అందజేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.
ఆచంట సూర్యకుమారి
W/o. సూర్యనారాయణ
చినబ్రహ్మదేవం, పెద్దాపురం మండలం
సెల్: 6302360700

పాస్‌పోర్ట్ పడిపోయినది
కుచ్చర్లపాటి అరుందతి, భర్త: సుబ్బ తాతంరాజు, కొత్తలంక పంచాయతీ కార్యాలయం దగ్గర ముమ్మిడివరం వాసిని. ది 09-06-2025న నేను నా పాస్‌పోర్ట్ నెం. **ఆర్ 9326902** గల పాస్‌పోర్ట్‌ను జిరాక్స్ నిమిత్తం ఇంటి నుండి ముమ్మిడివరం హై స్కూల్ సెంటర్‌కు వచ్చి చూసుకొనగా ఒరిజినల్ పాస్‌పోర్ట్ పడిపోయినది. వెంటనే పాస్‌పోర్ట్ కోసం వెతకగా దొరకలేదు. నా పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల నాకు అందజేయగలరని కోరి ప్రార్థిస్తున్నాను. అందజేసిన వారికి తగు పారితోషికం ఇవ్వబడును.
కుచ్చర్లపాటి అరుందతి
C/o. కుచ్చర్లపాటి శ్రీనివాసరాజు
కొత్తలంక పంచాయతీ దగ్గర, ముమ్మిడివరం మండలం
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా,
సెల్ నెం.95505 18718